క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రజారోగ్యానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కడివెళ్ల గ్రామానికి చెందిన మౌనిక వైద్య చికిత్స చేయించుకొన్నందుకు సీఎం సహాయ నిధి నుంచి రూ.2,75,000 మంజూరు కావడంతో చెక్కును ఎమ్మెల్యే తన నివాసంలో శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేసి మాట్లాడారు. ఆరోగ్యశ్రీ జాబితాలో లేని వ్యాధులకు సొంతంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు, వైద్యం చేయించుకొన్న వారికి సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ రంగస్వామి తదితరులు ఉన్నారు.

రసాయన మందులు తగ్గించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న వ్యవసాయాధికారులు

మద్దికెర: దేశ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆస్పిరేషనల్ పథకం అమలు చేసి ఆరోగ్యకరమైన పంటలు పండించేలా రైతులు ప్రోత్సహిస్తున్నారని ఆత్మ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కమ్యూనిటీ భవనంలో రైతుల సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఇష్టానుసారంగా క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియ ఎరువులు వినియోగం పెంచాలన్నారు. వ్యవసాయాధికారుల సలహాలు పాటించి తగిన మందులు వాడాలన్నారు. పంటల సాగుకు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేలా కృషి చేయాలన్నారు. ఆత్మ బీటీఎం స్వప్న, ఏఓ రవి, ఎంపీడీఓ నరసింహామూర్తి, ఎంఈఓ రంగస్వామి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, వైకేపీ ఏపీఎం మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలంలో రూ.4.90 లక్షల ఆదాయం

ఎమ్మిగనూరురూరల్: సబ్ డివిజన్ పరిధిలో అక్రమ మద్యం తరలింపులో పట్టుబడిన వాహనాలను శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయం ఆవరణలో డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో వేలం వేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సబ్ డివిజన్ పరిధిలోని ఎమ్మిగనూరు టౌన్, రూరల్, నందవరం, గోనెగండ్ల, మంత్రాలయం, మాధవరం, కౌతాళం, పెద్దకడబూరు, కోసిగి పోలీస్‌స్టేషన్ల పరిధిలో 2020–2021 సంవత్సరంలో 55 వాహనాలు పట్టుబడినట్లు చెప్పారు. వీటిని వేలం వేయగా 44 వాహనాలను పలువురు వ్యక్తులు కొనుగోలు చేశారని, రూ.4.90 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుత వేలంలో అమ్ముడుపోని వాహనాలను మరోసారి వేలం వేస్తామని చెప్పారు. టౌన్, కోసిగి సీఐలు మధుసూదన్ రావు, ఏరిషావలి, ఎస్ఐలు వేణుగోపాల్‌రాజు, మహేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

హాలహర్వి పీహెచ్‌సీ తనిఖీ

హాలహర్వి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డీఎంఅండ్‌హెచ్ఓ రామగిడ్డయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యుల హాజరు రికార్డులు, మందుల నిల్వలు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వైద్యం అందించాలని, మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డాక్టరుల తిమ్మయ్య, గంగాధర, మన్సూర్‌వలీ, సీహెచ్ఓ ఆదినారాయణ, సూపర్‌వైజర్ అబ్రహం, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

'ఉపాధి'లో అక్రమాలకు పాల్పడితే చర్యలు



సామాజిక తనిఖీ బహిరంగ సభలో విచారణ చేస్తున్న అధికారులు

ఆలూరు రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కర్నూలు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆలూరు సీఎల్ఆర్సీ భవనంలో.. ఏడాది కాలంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. 2022–23 ఏడాదికి సంబంధించి ఆలూరు ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్టు పరిధిలో 997 పనులు చేపట్టామన్నారు. ఉపాధి హామీ పథకం కూలీల పనులకు రూ.7 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ పనులకు రూ.1.80 కోట్లు ఖర్చే చేసినట్లు చెప్పారు. ఈ పనుల్లో సరైన ఆధారాలు లేనందున రూ.1.30 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. డ్వామా అడిషనల్ పీడీ సలీ బాషా, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ లోకేష్, స్టేట్ టెక్నీషియన్ మేనేజర్ లోకేశ్వర్ రెడ్డి, ఎస్సార్పీ వెంకటేష్ నాయక్, ఏపీడీ పక్కీరప్ప, సీఎల్ఆర్సీ ట్రైనింగ్ ఆఫీసర్ సురేష్, ఏపీఓ హేమసుందర్ సిబ్బంది ఉన్నారు.









శంకరబండ గ్రామంలో ఐసీడీఎస్ స్టాల్‌ను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య, పొనకలదిన్నెలో రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న ఎంపీడీఓ, వైఎస్సార్‌సీపీ నాయకులు, గంజిహళ్లలో కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న అధికారులు, హెబ్బటంలో వైద్య శిబిరానికి తరలి వచ్చిన ప్రజలు

పేదల ఆరోగ్యమే జగనన్న సురక్ష లక్ష్యం

- సురక్ష శిబిరాలతో గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా వైద్య సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



కోటేకల్ శిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి.



ముక్కెళ్ల శిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఎమ్మిగనూరురూరల్: పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కోటేకల్ గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి కోట్లాది రూపాయలు నిధులు ఖర్చుచేస్తున్నారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో బీపీ చెక్ చేయించుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. సర్పంచ్ జాలవాడి లక్ష్మి, ఎంపీటీసీ నరసింహులు, నాయకులు లక్ష్మన్న, శ్రీను, తిక్కన్న, తాయన్న, సోగనూరు భీమిరెడ్డి, ఎంపీడీఓ బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: పేదలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం ముక్కెళ్లలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. వైద్య శిబిరానికి వచ్చే వారందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం వారం క్రితం గుండె సంబంధిత వ్యాధితో చనిపోయిన గృహ సారథి అరవ చిన్న నాగన్న కుటుంబాన్ని, పెరాలసిస్‌తో బాధపడుతున్న మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లును పరామర్శించారు. అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు.

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పందికోన గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష క్యాంపును ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. జనరంజకమైన పథకాలతో పాటు ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. హెల్త్ క్యాంపునకు వచ్చిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అక్కడ ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. ఎంపీపీ నారాయణదాస్, ఎంపీడీఓ కవిత పాల్గొన్నారు.

వెల్దుర్తి: రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిఒక్కరికీ మంచి వైద్యం అందించేలా చర్యలు చేపట్టారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం బింగిదొడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ఆమె పరిశీలించారు. వైద్యులందిస్తున్న సేవలపై ప్రజలను ఆరా తీశారు. స్పెషలిస్ట్ వైద్యులచే అత్యాధునిక పరికరాలతో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలువురికి కంటి అద్దాలు, హెల్త్ కార్డులు, మందులు అందించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, బింగిదొడ్డి సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, పేరేముల సర్పంచ్ రాధా కృష్ణారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. శిబిరంలో 180 మందికి వైద్య సేవలందించినట్లు డాక్టర్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. డాక్టర్లు గీతావాణి, మాధవీలత, ఎంపీడీఓ రాణెమ్మ, సర్పంచ్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



ముక్కెళ్లలో వృద్ధురాలిని వైద్య శిబిరానికి తీసుకొస్తున్న సిబ్బంది

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంతో ప్రజారోగ్యానికి భరోసా కల్పించిందని గ్రామ సర్పంచ్ పావని, డాక్టర్ పరిమళ అన్నారు. శుక్రవారం పోనకలదిన్నె (టి.సోమలగూడూరు-1) గ్రామంలో వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. డాక్టర్లు పరిమళ, విజయభారతి శ్రీచరణ్, బాలకృష్ణ వైద్య సేవలందించారు. శిబిరాన్ని ఎంపీడీఓ దశరథరామయ్య, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి పర్యవేక్షించారు. శిబిరంతో 14 రకాల టెస్టులతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం ఆనందంగా ఉంది



ఇంతకు ముందు పేదలు ఆరోగ్య కేంద్రాలకు వెళితే పట్టించుకునే వారు లేకపోగా డాక్టర్ల కోసం వేచిచూడాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ఆనందంగా ఉంది. నేను శుక్రవారం శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నాను. డాక్టర్లు పరీక్షించి జాగ్రత్తలు చెప్పి మందులు ఇచ్చారు. గ్రామంలోనే ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వైద్య సేవలందించడం గతంలో ఎన్నడూ చూడలేదు. ప్రజలకు ఇలాంటి పాలనే అవసరం. – మాళమ్మ, హెబ్బటం గ్రామం



బింగిదొడ్డి హెల్త్ క్యాంప్‌లో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామ సచివాలయం-2లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఇద్రూష్‌బాషా పర్యవేక్షించారు. శిబిరంలో వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పించారు.నాయకులు ఆర్.హనుమంతరెడ్డి, మీనుగ మాదక్క, బండమీది తిమ్మక్క పాల్గొన్నారు.

గోనెగండ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందుతుందని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం గంజిహళ్లి గ్రామం ఎంపీయూపీ పాఠశాలలో వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. దాదాపు 500 మంది వైద్య సేవలు పొందారు. డాక్టర్లు కార్తిక్, అపర్ణ, తరుణ్, దుర్గ విజయశ్రీ వారందరికీ వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే కంటి పరీక్షలు చేసుకున్న కొంతమందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.

హొళగుంద: 'జగనన్న ఆరోగ్య సురక్ష' తో ప్రజారోగ్యానికి భద్రత, భరోసా కలుగుతుందని ఎంపీడీఓ సుహాసినమ్మ, తహసీల్దారు హుసేన్‌సాహెబ్ అన్నారు. శుక్రవారం హెబ్బటం గ్రామంలో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు న్యూటన్, రాధ, సలీముద్దీన్, మనోజ్‌కుమార్ వైద్యసేవలందించారు. శిబిరంలో 410 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ముందులు అందించారు.

జిల్లా అభివృద్ధిపై చర్చ



మంత్రి గుమ్మనూరు జయరాంతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

ఆలూరు: జిల్లా సమగ్రాభివృద్ధి, పాలనపై శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన చర్చించారు. శుక్రవారం మంత్రిని ఆయన నివాసంలో కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కుటుంబసభ్యులు కలెక్టర్‌ను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రితో ఇంటింటికీ తాగునీరు, ప్రాజెక్టులు, రోడ్లు, జగనన్న గృహాలు, ఎల్లెల్సీ, హెచ్ఎల్సీ, వివిధ అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా చర్చించారు. రోడ్ల నిర్మాణం, తాగునీటి సదుపాయం, రిజర్వాయర్ల పనులు, కళాశాలల మంజూరు, శాశ్వత భవనాలు వంటివి పూర్తయితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు. అలాగే గ్రామాల్లో ఇళ్లు లేని వారిని స్థలాలను మంజూరు చేయాలని మంత్రి కలెక్టర్‌ను కోరారు.

రీసర్వే పకడ్బందీగా చేపట్టండి



రీసర్వే వివరాలను తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: భూముల రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తహసీల్దార్ కార్యాలయంలో భూసర్వే పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో ఎలాంటి తప్పులకు తావులేకుండా పకడ్బందీగా చేపట్టాలన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దులను చూయించాలని చెప్పారు. అనంతరం భూ సర్వే రికార్డుల గదిని పరిశీలించారు. సబ్ కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ ఆంజనేయులు, రీసర్వే డీటీ జోతిర్మయి, వీఆర్వో షేక్షావలి, ఇన్‌చార్జ్ సర్వేయర్ వాహిద్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినీలతో ప్రిన్సిపాల్ డాక్టర్ జయం శ్రీనివాసగుప్త

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీకి చెందిన 25 మంది విద్యార్థినులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని శనివారం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జయం శ్రీనివాసగుప్త అభినందించారు. ఆయన మాట్లాడుతూ హ్యాండ్‌బాల్‌లో ఎస్.ధనుష, కె.లలిత, టి.ఖాసీంబీ, బి.స్నేహ, క్రికెట్‌లో పి.అక్షయ, డి.అమిత, కె.తిరుమల, బి.సత్య, నెట్‌బాల్‌లో టి.దేవికభార్గవి, పి.చాందిని, త్రోబాల్‌లో ఎం.నిహారిక, రన్నింగ్‌లో కె.చరిత, కబడ్డీలో టి.రేణుక, యోగాలో జాహ్నవీ, టేబుల్ టెన్నిస్‌లో జి.వర్షశ్రీ, కె.తేజశ్విని, ఫుట్‌బాల్‌లో కె.రుబీకా, బి.జాహ్నవి, వెయిట్ లిఫ్టింగ్‌లో ఏ.అఖిలాబీ, కె.దివ్యశ్రీ, పి.పార్వతి, చెస్‌లో టి.తేజశ్విని, సాఫ్ట్‌బాల్‌లో ఏజీ.సుజాత, ఏజీ.సునీత, ఖోఖోలో కె.ఎల్లేశ్వరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు.

పి.కోటకొండలో డ్రైడే-ఫ్రైడే

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి తొట్టెలు, డ్రమ్ములు, బిందెల్లో ఎక్కువ కాలం నీటిని నిల్వ ఉంచుకోరాదని సూచించారు. నీటి నిల్వల వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయని, దోమకాటుకు ప్రజలు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సూపర్‌వైజర్ రంగస్వామి, ఏఎన్ఎం వీరమ్మ, ఆశావర్కర్లు ఉన్నారు.

చేసిన మంచిని వివరిద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కో-ఆర్డినేటర్ నారాయణస్వామి

ఆలూరు: వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, నిర్వహించిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గుమ్మనూరు నారాయణస్వామి సూచించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శక్రవారం మండలాధ్యక్షుడు వీరేష్ సమక్షంలో 'రాష్ట్రానికి మళ్లీ జగనన్నే ఎందుకు కావాలి' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ ఏరూరుశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఈరన్న, వైస్ ఎంపీపీ శ్రీరాములు, నాగవేణి తదితరులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలని సూచించారు. టీడీపీ నాయకుల భవిష్యత్‌కే గ్యారెంటీ లేదని, చంద్రబాబు అరెస్ట్‌తో గతంలో అవినీతికి పాల్పడిన ఆ పార్టీ నాయకులకు గుబులు పట్టుకుందన్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉందనే విషయాన్ని ఇంటింటికీ వెళ్లి తెలియజెప్పాలన్నారు.

చిప్పగిరి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు మారయ్య ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగన్', 'రాష్ట్రానికి మళ్లీ జగనన్నే ఎందుకు కావాలి' కార్యక్రమంపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు చేపట్టాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఎంపీపీ జూటూరు హేమలత, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

వెల్దుర్తి: స్థానిక సచివాలయం-3 పరిధిలోని బుడగజంగాల కాలనీ, ఇతర కాలనీలలో రూ.25 లక్షల నిధులతో సీసీ రోడ్ల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శనివారం వెల్దుర్తికి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి తెలిపారు. అలాగే ఎమ్మెల్యే రామళ్లకోట గ్రామంలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను పరిశీలించనున్నట్లు వెల్లడించారు.

ఉపాధిని సద్వినియోగం చేసుకోండి

తుగ్గలి: వలసల నివారణకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఇంజినీరింగ్ కన్సల్టెంట్ ప్రదీప్‌కుమార్ కోరారు. శుక్రవారం ముక్కెళ్లలో ఉపాధి గ్రామ సభ నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనుల గుర్తింపు, 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులను వివరించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగానే పనులు గుర్తించి సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో టీఏ పరీదప్ప, ఉపాధి సిబ్బంది గోవర్ధనరెడ్డి, చిరంజీవి, నాగరాజు, మునెప్ప, వెంకటేశ్వర్లు, తిమ్మయ్య, సూరి పాల్గొన్నారు.

ఈ-కేవైసీకి 8 వరకు గడువు

తుగ్గలి: పంట నమోదుకు సంబంధించి ఈ-కేవైసీ గడువు ఈనెల 8వ తేదీ ఆఖరు అని వ్యవసాయశాఖ మండల అధికారి పవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మండలవ్యాప్తంగా ఖరీఫ్‌లో 60,500 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయన్నారు. మొత్తం 18,925 మంది రైతులు ఉండగా వారిలో ఇప్పటి వరకు 13,927 మంది ఈ-కేవైసీ చేయించుకున్నారని చెప్పారు. మిగిలిన రైతులు కూడా ఈ నెల 8వ తేదీలోపు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. లేకపోతే ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలు పొందలేరన్నారు.

ఉచితంగా ట్యూషన్

మద్దికెర: వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి సేవాదళ్ ఆధ్వర్యంలో మద్దికెరలో అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఉన్న కార్యాలయంలో పేద విద్యార్థుల కోసం ఉచితంగా ట్యూషన్ నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు చంద్రమౌళి శుక్రవారం తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ట్యూషన్ నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వెల్దుర్తిలో నేడు విద్యుత్ కోతలు

వెల్దుర్తి: స్థానిక పాతబస్టాండు నుంచి కర్నూలు రోడ్డు కుడివైపు ప్రాంతం, రాణితోటలోని 12, 13వ వార్డులకు శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. పాతబస్టాండు ప్రాంతంలో కిందకు ఉన్న విద్యుత్ తీగలను మార్చే క్రమంలో పెద్ద స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉందని, ఈ పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంటి స్థలం మంజూరు

వెల్దుర్తి: 15ఏళ్ల క్రితం స్వగ్రామం కొంగనపాడు నుంచి వెల్దుర్తి మండలం సూదేపల్లెకు వలస వచ్చి ఉంటున్న తమకు ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చి మంజూరు చేయడం ఆనందంగా ఉందని, సీఎం జగనన్నకు రుణపడి ఉంటామని లబ్ధిదారుడు దేవరాజు సంతోషం వ్యక్తం చేశారు. శనివారం గ్రామ సర్పంచ్ బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, వినోద్ తదితరులు దేవరాజు కుటుంబానికి మంజూరైన ఇంటి పట్టాను అందించారు. జగనన్న కాలనీలోని మిగులు స్థలంలో వారికి 1.5 సెంట్లు కేటాయించినట్లు, అలాగే గృహం మంజూరు చేసి నిర్మాణం ప్రారంభించేలా సహకారం అందించనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

రైతు సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

గోనెగండ్ల: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం వేముగోడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ శనగ విత్తనాలను ఏడీఏ మహమ్మద్ ఖాద్రితో కలిసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబీ సీజన్ కోసం రైతులకు ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. ఏఓ హేమలత, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బందెనవాజ్, నరేష్ రెడ్డి, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమ వెలుగులు

నందవరం: మండల కేంద్రంలోని వార్డు-1 పరిధిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శివారెడ్డిగౌడ్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, సర్పంచ్ తోట సావిత్రి, ఎంపీటీసీ బసమ్మ, నాయకులు రమేశప్పగౌడ్, మీసాల సంపత్‌గౌడ్, చాంద్‌తాత, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరుముద్ద సక్రమంగా అందించాలి

విద్యార్థులకు జగనన్న గోరుముద్ద సక్రమంగా అందించాలని వంట ఏజెన్సీ సభ్యులను ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో వంట ఏజెన్సీ సభ్యులకు వంట పాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా పౌష్టికాహారం, రాగి మాల్ట్ అందిస్తున్నారని పేర్కొన్నారు.

దేవదాయ భూములు ఆక్రమిస్తే చర్యలు



చేనేత కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎస్ఐ గోపాల్

పత్తికొండ రూరల్: దేవదాయ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు హెచ్చరించారు. పత్తికొండ-పుచ్చకాయలమాడ రోడ్డులోని గురుకులం పాఠశాల ఎదురుగా సర్వే నంబర్ 298లో 18 ఎకరాలు, 295లో 13 ఎకరాలు దేవదాయ శాఖ పరిధిలో ఉందన్నారు. 1997లో ఈ స్థలంలో చేనేతలకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. మిగతా స్థలం అన్యాక్రాంతమవుతుందని విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ నాయకులు కొన్నిరోజుల క్రిందట కలెక్టర్, ఎండోమెంట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించి హద్దు రాళ్లు పాతేందుకు ఆ స్థలంలోకి అసిస్టెంట్ ఎండోమెంట్ కమిషనర్ జేసీబీని తీసుకెళ్లారు. అప్పటికే తాము కట్టిన ఇళ్లు జేసీబీతో కూల్చేస్తున్నారన్న అనుమానంతో చేనేత కాలనీవాసులు ఎండోమెంట్ అధికారి కారును అడ్డుకోవడంతో పాటు విశ్వహిందూ పరిషత్ నాయకులపై దాడికి యత్నించడంతో ఉద్రిక్తతకు దారితీసింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ గోపాల్ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. విషయాన్ని ఆర్డీఓ, తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లి భూముల పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటామని ఎండోమెంట్ అధికారి వివరించారు.

విజేత ప్రకాశం జిల్లా వృషభాలు



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

గోనెగండ్ల: శ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశమి మహోత్సవాల సందర్భంగా ట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. ఆరు పళ్ల, న్యూ కేటగిరీ విభాగాల్లో 40 జతల వృషభాలు పాల్గొన్నాయి. న్యూ కేటగిరీలో ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం గంగన్న పాలెంకు చెందిన వృషభాలు విజేతగా నిలిచాయి. శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వృషభాల యాజమానికి మదీనా కంకర్ మిషన్ యాజమాని సుభాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్సూర్, భాస్కర్ రెడ్డి, కుమారస్వామి, అమరేశ్వరప్పలు రూ.50 వేల నగదును అందజేశారు. తర్వాతి స్థానాల్లో నిలిచిన నంద్యాల జిల్లా, పాణ్యం మండలం, కొత్తూరు వృషభాల యాజమానికి రూ.40 వేలు, ప్రకాశం జిల్లా, బేస్తవారిపేట మండలం, కాజీపురం వృషభాల యాజమానికి రూ.30 వేలు, నంద్యాల జిల్లా, శిరివెళ్ల మండలం, గుంప్రమానుదిన్నె వృషభాల యాజమానికి రూ.20 వేలు, గుంటూరు జిల్లా, పత్తిపాడు వృషభాల యాజమానికి రూ.10 వేలు నగదును అందజేశారు.

విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు చర్యలు

కృష్ణగిరి: అర్హత కలిగిన రైతులందరికీ విద్యుత్ వ్యవసాయ కనెక్షన్లు ఇస్తామని ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోనే కృష్ణగిరి మండలంలో ఎక్కువగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామన్నారు. విద్యుత్ కనెక్షన్ల కోసం 450 దరఖాస్తులు వచ్చాయని, వీటిని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి మంజూరు కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. విద్యుత్ కనెక్షన్ ఇప్పిస్తామని కొందరు దళారులు, సిబ్బంది డబ్బులు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిని నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. అర్హులై ఉంటే అన్ని ఆధారాలతో మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని కార్యాలయంలో అందజేయాలన్నారు. గ్రామాల్లో జీఐపీ సర్వే పూర్తి కావచ్చిందని, అక్రమంగా విద్యుత్ వాడేవారు ఇప్పటికైనా కొత్త కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.